స్థాపితం : 1930
LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM
స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు
జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 80 సంచిక : 6 6-2-2009 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-







### అగ్గిమీద గుగ్గిలం వలె మండిపడుతున్న ముఖ్యమంత్రి

# రామోజీతో డిఎస్ రహస్య భేటీ!

పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఈనాడు అధినేత రామోజీరావుతో రహస్య సమావేశం జరిపారన్న వార్త ముఖ్యమంత్రిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఎవరూ కల కూడా కనని పరిణామం ఇది. రెండు వారాల క్రితం



ఒకరోజు మధ్యాహ్నం డి.శ్రీనివాస్ ఎవరికీ చెప్పకుండా రామోజీఫిల్మ్ సిటీకి వెళ్లారట. దాదాపు మూడు గంటల పాటు అక్కడ రామోజీరావుతో గడిపారట. తమ ఆంతరంగిక సిబ్బందికి కూడా సమాచారం ఇవ్వకుండా ఒక ప్రైవేట్ కారులో వెళ్లాడట ఆయన. సెక్యూరిటీ ఏర్పాట్లు చూసే పోలీసులు కానీ, ఇంటెలిజెన్స్ వర్గాలు కానీ ఏ మాత్రం పసిగట్టలేక పోయారు. సమావేశం జరిగిన నాలుగు రోజుల తర్వాత రామోజీఫిల్మ్ సిటీలో పనిచేసే ఒక చిరుద్యోగి ముఖ్యమంత్రి సిబ్బందికి ఈ పోబిడి అందించారట. దాన్ని విని ముఖ్యమంత్రి బిత్తరపోయారు.

రామోజీరావుకు, వైఎస్ రాజశేఖరరెడ్డికి మధ్య ఎంత తీవ్రస్థాయిలో రాజకీయ పోరాటం జరుగుతున్నదీ అందరికీ తెలుసు. రామోజీరావు వ్యాపార సామ్రాజ్యాన్ని చిందర వందర చేసి, ఆయన సంస్థలన్నిటినీ మూత వేయించాలని గత మూడేళ్లుగా విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు ముఖ్యమంత్రి. అందుకోసం తన అధికార పరిధి కూడా అతిక్రమించి ప్రవర్తిస్తున్నారు. ఈనాడుకు పోటీగా దాదాపు 500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి సాక్షి దినపత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో వార్తలకంటే, రామోజీరావు మీద నేరారోపణలకు, ఈనాడు వార్తలకు సమాధానాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రామోజీరావును ఒక్క రోజైనా జైలులో పెట్టాలనే ప్రయత్నం చేస్తున్నాడు. రామోజీరావు శక్తియుక్తులన్నీ వైఎస్ దాడుల నుంచి తనను తాను కాపాడుకోవడానికే సరిపోతున్నాయి. ఎన్నోరకాల న్యాయపరమైన ఎత్తుగడలతో అతి కష్టం మీద తనను తాను కాపాడుకొంటున్నాడాయన. వైఎస్

> **ఏమి మాట్లాడివుంటారనేదే అర్థంకాని ప్రశ్న?**

ఎప్పుడు గద్దె దిగుతాడా అని రోజులు లెక్క పెట్టుకొంటున్నాడు.

ఇద్దరిమధ్య ఇంత తీవ్రస్థాయిలో శతృత్వం వున్నదని తెలిసీ, పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్, రామోజీరావుతో రహస్య భేటీ జరపడం సహజంగానే ముఖ్యమంత్రికి ఎక్కడలేని ఆగ్రహం కల్గించింది. ఈ సమాచారం నిజమని ధృవపరచుకొన్న వెంటనే సోనియాగాంధీకి ఫిర్యాదు చేసినట్లు చెప్తున్నారు. సోనియాగాంధీకి, రామోజీరావుకు మధ్య వ్యక్తిగత కోపతాపాలేవీ లేనప్పటికీ, ఆయన మీద తాను జరిపే పోరాటానికి ఆమె అనుమతిని ఎప్పుడో తీసుకొన్నాడు రాజశేఖరరెడ్డి. సోనియాగాంధీ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు ఈనాడులో వచ్చిన వార్తలు, ఆమె మీద వేసిన కార్టూన్లు, వ్రాసిన సంపాదకీయాలను ఆమెకు చూపించి, రామోజీరావు కాంగ్రెస్‌కు ఆగర్భ శత్రువు అన్న వివరణ ఇచ్చి, ఈనాడు మీద కాలు దువ్వడానికి అనుమతి తీసుకొన్నాడు ముఖ్యమంత్రి. ఈనాడుకు ఆంధ్రాతో పాటుగా పలు ఉత్తర భారత రాష్ట్రాలలో కూడా టివి ఛానల్ వుండడంతో, ఆయా రాష్ట్రాల కాంగ్రెస్‌వాదుల నుంచి సోనియాగాంధీ మీద ఒత్తిడి వచ్చే అవకాశం వుందని ముందుగానే వూహించి ఈ జాగ్రత్త పడ్డాడు ముఖ్యమంత్రి. అందువల్లనే ఈ మూడు నాలుగేళ్లలో రామోజీ వ్యవహారాలు ఎంత వివాదాస్పదం అవుతున్న ఆమె జోక్యం చేసుకోవడం లేదు. ఎందుకొచ్చిన చీకాకని ముఖ్యమంత్రిని నిలువరించడమూలేదు.

డిఎస్, రామోజీలు కలిసి మాట్లాడుకొన్నారని తెలుసుకానీ, ఏమి మాట్లాడుకొన్నది మాత్రం ఎవరికీ తెలియదు. అందువల్ల ఎవరి వూహలు వారు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మీద ఈనాడు దూకుడు తగ్గించడానికి,



రామోజీని శాంతపరచడానికి వెళ్లాడని కొందరు చెప్తుంటే; టిఆర్ఎస్‌తో పొత్తు విషయంలో కెసిఆర్‌ను ఒప్పించమని అడగడానికి వెళ్లాడని మరికొందరి వాదన. వారి సమావేశం జరిగే నాటికి

తొరవ 14వ పేజీలో



## చెత్తగిరి వెంకటగిరి!

జిల్లాలో ఇప్పటికే పలుగ్రామాలు, పట్టణాలలో పారిశుధ్యం క్షీణించి ప్రజలు రోగాల బారినపడుతున్నారు. అంటు రోగాలు ప్రబలి ఆస్పత్రులపాలవుతున్నా పలు ప్రాంతాలలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా వుండనడానికి వెంకటగిరి నియోజకవర్గం ఒక ఉదాహరణ. నియో

### మునిసిపాలిటీకి పట్టదా?

జకవర్గ పరిధిలోని పలు గ్రామాలు చెత్తాచెదారాలతో కుళ్లు కంపుకొడుతున్నాయి. కాలువల్లో మురుగునీరు పొంగి వీధులలోకి ప్రవహిస్తున్న దృశ్యాలే ఎక్కడ చూసినా కన్పడుతాయి. మంచి నీరు బోర్ల వద్ద మురుగు నీరు ముంచెత్తుతున్నదంటే ఎంతగా పారిశుధ్యం లోపించిందో తెలుస్తున్నది. దోమల ఉత్పత్తి పెరిగి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వెంకటగిరి మండల పరిధిలోని పాలకొండ సత్రం, బాలసముద్రం, కలపాడు తది

తరువ 14వ పేజీలో



జిల్లాలోని ఏదో ఒక అసెంబ్లీ స్థానం నుంచి పార్టీ టిక్కెట్ కేటాయించాలని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ.

## శిథిలావస్థలో స్కూళ్లు!

సంగం మండలంలో చదువులు చట్టుబండలవుతున్నాయి. విద్యాభివృద్ధి కోసం కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నట్లు ప్రభుత్వం చెప్పుకొంటున్నా ఈ ప్రాంతంలో మాత్రం విద్యార్థులు చదువుకొనేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. మండల పరిధి

### సంగం విద్యార్థుల పాట్లు!

లోని ఏ పాఠశాలను పరిశీలించినా సమస్యలతో సతమతమవుతున్నవే దర్శనమిస్తాయి. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలు దయనీయంగా వున్నాయి. శిథిలావస్థలో వున్న భవనాలు ఒకవైపు, త్రాగునీరు, మరుగుదొడ్లు లాంటి కనీస సౌకర్యాలకు కూడా నోచుకోక విద్యార్థులు అవస్థలతో కుస్తీ పడుతున్నారు. పెరమన దళితవాడలో గల పాఠశాల భవనం ఎప్పుడు కూలుతుందోనని అనుక్షణం పిల్లలు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

తరువ 14వ పేజీలో

# సంగం బ్యారేజ్ షట్టర్లు పడ్డాయి!

మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా వుంది కావలి కాలువ ఆయకట్టు రైతుల పరిస్థితి. సంగం బ్యారేజ్



నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వం కోసం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డికి దరఖాస్తును ఇస్తున్న ఆ పార్టీ రాష్ట్ర బిసి సెల్ కో-ఆర్డినేటర్ కనకట్ల రఘురామ్ ముదిరాజ్.

వద్ద ఏర్పాటు చేసిన ఆరుషట్టర్లు పడిపోవడంతో కావలి కాలువకు నీటిపారుదల తగ్గిపోయింది. నీటిపారుదల శాఖ అధికారుల అవగాహనా లోపం వలన సంగం ఆనకట్ట వద్ద నీరు వృధాగాపోతుంది. నీటి ఉధృతి కారణంగా షట్టర్లు పడిపోవడంతో నెల్లూరు బ్యారేజ్‌వైపు నీరు పరుగులు తీస్తున్నది. సంగం బ్యారేజి నుంచి కావలి కాలువకు నీటిని ఇచ్చేందుకుగాను నీటి మట్టాన్ని పెంచాలని అధికారులు నిర్ణ

### కావలి రైతులకు సాగునీరెలా?

యించారు. దీనికి అనుగుణంగా ఫాలింగ్‌షట్టర్స్‌ను పూర్తి స్థాయిలో పటిష్టం చేయకపోవడంతో నీటి ఉధృతికి ఈ షట్టర్లు పడిపోయాయి. వీటికి ఆధారంగా వుంచిన ఇసుక బస్తాలు సైతం కొట్టుకపోయాయి. ఈ పరిస్థితులలో ఉధృతంగా నీరు ఆనకట్టపై ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నా అధికారులు రాకపోకలు నిలిపివేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. నీటి ఉధృతి కారణంగాఇక్కడ రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, లారీలు ప్రమాదానికి గురౌతున్నాయి.

### రాజ్యలక్ష్మమ్మ పర్యటన

ఎన్నికలు సమీపిస్తుండడంతో

తరువ 14వ పేజీలో




ఎయిడ్స్ అవేర్‌నెస్ ర్యాలీని బుచ్చిలో నిర్వహిస్తున్న డి.ఎల్.ఎన్.ఆర్.హైస్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు; అధికారి బాలకేశవులు.

## వవ్వేరు బ్యాంక్ ఛైర్మన్‌గా నారయ్య!

బుచ్చి పట్టణంలోని వవ్వేరు సహకార కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌గా జొన్నలగడ్డ నారాయణరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గతంలో ఛైర్మన్ పదవి కోసం కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలు తలపడి గందరగోళం చెలరేగి మినిట్స్ బుక్స్ చింపుకోవడం ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టుకోవడం వరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ దఫా ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా ఏకగ్రీవానికి రెండు పార్టీలు సమ్మతించడంతో టిడిపికి చెందిన నారయ్య ఛైర్మన్ పీఠాన్ని అధిరోహించాడు. మొత్తం 13 మంది డైరెక్టర్లు వుండగా మెజార్టీ కాంగ్రెస్ పక్షీయులు ఛైర్మన్‌గా ఎంపికైన నారయ్య మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న

### ఇంతకు ఏ పార్టీకి చెందినవాడు?

ప్పటికి గత కొన్నినెలలుగా పార్టీకి దూరంగా వుంటూ వస్తున్నారు. అట్లని రాజీనామా చేయలేదు. ఛైర్మన్ ఎంపిక సమయంలో తెలుగుదేశం వారు బ్యాంకు ఛాయలకి రాకపోవడం నారయ్యకు పార్టీకి మధ్య ఉన్న దూరాన్ని తెలి

తరువ 14వ పేజీలో



విడవలూరు మండలం వావిళ్ల ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న విశ్వచైతన్యం ఆధ్యాత్మిక సేవా సంస్థ

## గ్రావెల్‌ను త్రవ్వేస్తున్నారు!

వెంకటాచలం మండలంలో అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. వ్యాపారులు ఇష్టానుసారం ప్రభుత్వ, ప్రైవేట్ భూములన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ గుంటలు త్రవ్వి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూముల్లో పెద్దఎత్తున గ్రావెల్ త్రవ్వకాలు జరుగుతున్నాయి. మండలం చుట్టుప్రక్కల జరుగుతున్న అభివృద్ధి పనుల వలన గ్రావెల్‌కు మంచి గిరాకి ఏర్పడింది. దీంతో అటు కృష్ణపట్నం పోర్టు, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అవసరమైన గ్రావెల్‌ను వ్యాపారులు ఇక్కడి నుంచే అందిస్తున్నారు. దళారులు రంగప్రవేశం చేసి ప్రభుత్వ భూములు, అటవీభూములు,

### వెంకటాచలంలో చోద్యం చూస్తున్న అధికారులు

ప్రైవేట్ భూములన్న తేడా, లేకుండా ఇష్టప్రకారం త్రవ్వేస్తున్నారు. పేద రైతులు, దళితులు తమ భూముల్ని సాగుచేయకుండా వుంటే వారిని సంప్రదించి పొలాన్ని సాగుకు అనుకూలంగా చేసి ఇస్తామని మాయమాటలు

తరువ 14వ పేజీలో

# జోరందుకొన్న గ్యాస్‌ఫిల్లింగ్!



ఇలా.. గ్యాస్‌ఫిల్లింగ్ చేస్తారు.

నగరంలో వంటగ్యాస్ సిలిండర్ల నుంచి చిన్న చిన్న సిలిండర్లలోకి గ్యాస్‌ను నింపే వ్యాపారం జోరుగా సాగుతుంది. గిడ్డంగివీధి, పెద్దబజారు, కోటమిట్ట, కొరడావీధి, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేటల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతుంది.

**చూస్తూ ఊరుకొంటున్న పౌరసరఫరాల శాఖ**

వంట గ్యాస్ సిలిండర్లలో 14.5 కిలోల గ్యాస్ వుంటుంది. మామూలుగా గ్యాస్ సిలిండర్ మూడు వందల రూపాయలకు దొరుకుతుంది. ఫిల్లింగ్ వ్యాపారస్తులు రెండు నుంచి మూడు కిలోల గ్యాస్‌ను మినీ సిలిండర్లలో నింపి 75 నుంచి 150 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. దీనివల్ల ఒక సిలిండర్‌లోని గ్యాస్‌ను వెయ్యి రూపాయలకు పైగా విక్రయించవచ్చు. గతంలో బంగారు వ్యాపారస్తులు బొగ్గుల పొయ్యి వాడేవారు. ఇప్పుడు మినీ సిలిండర్లతో తమ పని కానిస్తున్నారు. దీంతో కొందరు గ్యాస్ ఫిల్లింగ్ వ్యాపారం చేసుకొంటున్నారు. గ్యాస్ ఫిల్లింగ్ నాటు పద్ధతుల్లో చేయడం ప్రమాదకరం. దీనివల్ల పేలుళ్లు జరుగుతాయి. అగ్నిమాపక శాఖ మామూళ్లు తీసుకొని ఈ వ్యవహారాన్ని పట్టించుకోక పోవడంతో వన్ టౌన్, టూటౌన్ పోలీసులు ఈవారం గ్యాస్ ఫిల్లింగ్ వ్యాపారస్తులపై దాడులు చేసి అరెస్ట్ చేశారు. ఈ అరెస్టులు ఈ అక్రమ వ్యాపారాన్ని ఆపలేవు. గ్యాస్ ఫిల్లింగ్ వ్యాపారుల్లో మార్పే ఈ సమస్యకు పరిష్కారం.



డైకస్‌రోడ్డులోని మార్కెట్ నాగేశ్వరరావు ఇంటి ముందు పోలీసు పంచాయతీ.

# రౌడీషీటర్ల ఇళ్ల ముందు పోలీస్ మేళా!

నెల్లూరు పోలీసులు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత వారం రోజుల నుంచి నగరంలోని రౌడీషీటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఆ వీధిలోనే మేళా నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతీయులను రౌడీషీటర్ ఎలా వుంటున్నాడు; తోక జాడిస్తున్నాడా మొదలైన విషయాలన్నీ అడుగుతున్నారు. నగర సిఐ వీరాంజనేయరెడ్డి, ఆరుగురు పట్టణ ఎస్‌ఐలు వారి సిబ్బంది రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్తుండడంతో పలువురికి తమ వీధుల్లోని రౌడీషీటర్ల వివరాలు తెలుస్తున్నాయి. నగరంలోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 146 మంది రౌడీషీటర్లు వున్నారు. వీరిలో 50 మందికి పైగా కాంగ్రెస్, తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ, బిజెపి పార్టీలతో దగ్గరి సంబంధాలు పెట్టుకొని నగరంలో దాదాగిరి చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు వస్తుండడం, త్రిముఖ పోటీ నేపథ్యంలో రౌడీషీటర్లపై గట్టి ఒత్తిడి తేకుంటే ఇబ్బందులు తప్పవన్న నేపథ్యంలో పోలీసులు ముందుగానే రౌడీషీటర్లను అదిరించి బెదిరించను వారి ఇళ్ల ముందుకు వెళ్లారు.

**"ధైర్యం చేసిన సిఐ వీరాంజనేయరెడ్డి!"**

నగరంలో పేరుమోసిన రౌడీషీటర్ మార్కెట్ నాగేశ్వరరావు ఇంటి ముందుకు పోలీసులు ఈసారి ధైర్యం చేసి వెళ్లారు. ముందు ఆయన స్నానం చేస్తున్నారని చెప్పిన అనుచరులు ఆ తర్వాత లేడని చెప్పారు. నాగేశ్వరరావు కుటుంబసభ్యులైతే ఇళ్ల ముందుకు రావడం ఏమిటని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. రామలింగాపురంలో ఓ రౌడీషీటర్ తమను బెదిరిస్తున్నాడని వ్యాపారస్తులు చెప్పడంతో వీరాంజనేయరెడ్డి అతనికి రోడ్డు మీదే లాఠీ రుచి చూపించారు. జెండావీధి, అయ్యప్పగుడి ప్రాంతాల్లోని రౌడీషీటర్లను వీరాంజనేయరెడ్డి తనదైన శైలిలో అదిలించారు. వీరాంజనేయరెడ్డి గారూ... మీ వరకు మీరు బాగానే డ్యూటీ చేశారు. మీ సిబ్బంది కూడా రౌడీషీటర్ల పట్ల కరకుగా వ్యవహరిస్తే నగరంలో శాంతిభద్రతలు అదుపులో వుంటాయి.



# మద్యం వ్యాపారులకు పండగ!

**ప్రభుత్వం బాటిల్‌పై రూ.5 పెంచితే షాపులవాళ్లు 50 పెంచారు**

మద్యం ధరలను ప్రభుత్వం మళ్లీ పెంచడంతో బ్రాందీషాపులు, బార్ల నిర్వాహకులు మహదానందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కూడా ప్రభుత్వం ఓ మద్యం బాటిల్‌పై ఐదు రూపాయలు పెంచింది. దీన్ని ఆసరాగా చేసుకొని బ్రాందీషాపులు, బార్ల నిర్వాహకులు బీర్ బాటిల్‌పై 30 నుంచి 40 రూపాయలు, బ్రాందీ బాటిళ్లపై 60 రూపాయలు అదనంగా పెంచి అమ్ముకున్నారు. ఎక్సైజ్ అధికారులు, సివిల్ పోలీసులకు నెలసరి మామూళ్లు ఇస్తుండడంతో వీరిని నియంత్రించేవాళ్లు లేకుండా పోయారు. ఈవారంలో మద్యం బాటిల్‌పై మళ్లీ ఐదు రూపాయలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మామూలుగా జిల్లాలో ప్రతి రోజు కోటి రూపాయల మేర మద్యం వ్యాపారం జరుగుతుంది. మద్యం రేట్లు పెంచడంతో కోటి 25 లక్షలకు ఈ వ్యాపారం పెరిగింది. ఇదే అదనుగా మళ్లీ బ్రాందీషాపుల వాళ్లు 1వ తేది నుంచి బీర్లు, బ్రాందీరేట్లు పెంచేశారు. కొత్త ధరల ఆధారంగా రాయల్ ఛాలెంజ్ బీరు 42 రూపాయలైతే, కింగ్ ఫిషర్ 38, ఖర్జూరా 41, హేవార్డ్స్-5000 బీరు 45 రూపాయలయ్యాయి.

తరువాయి 14వ పేజీలో





ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

**పాఠకులకు ప్రత్యేక కానుక**

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా
ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా
"సెల్లో" హాట్ పాట్ అందిస్తున్నాము.
1-12-2008 నుండి 31-3-2009 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

Registered : RN 1156 / 57
J/Nellore/008/09-11


# ఎమ్మెల్యేల జాతకాలు ఆ ఇద్దరికే ఎరుక!

170 స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తైపోయిందని సిఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చేసిన ప్రకటన ఎమ్మెల్యేలను కలవర పెడుతున్నది. ఆ జాబితాలో తమ పేర్లు వున్నాయా లేవా అన్న ఉత్కంఠతో నరాలు తెగే టెన్షన్ అనుభవిస్తున్నారు. ముఖ్యమంత్రిని ఎన్నిసార్లు కలిసినా ఏ



మాత్రం పోబిడి బయటపడడం లేదు. అడిగితే నవ్వు తప్ప నోటి నుంచి మాటల ముత్యాలు రాలడం లేదు. కనీసం సూచనప్రాయంగా కూడా ఎవరికీ మీ టిక్కెట్ ఖాయమని చెప్పడం లేదాయన. జెసి దివాకర్‌రెడ్డి వంటి సీనియర్ మంత్రులు, పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ వంటి వారికి కూడా సమాచారం లేదు. అందరి జాతకాలు ముఖ్యమంత్రి, కెవిపి రామచంద్ర రావుల గుప్పెటలో వున్నాయి. ముఖ్యమంత్రి అయినా ఒకసారి కాకుంటే మరొకసారి ఏదో ఒక రకంగా నోరు జారి నిజం చెప్తాడేమో కానీ, కెవిపి నుంచి సమాచారం రాబట్టడం ఆయన్ను పుట్టించిన బ్రహ్మతరం కూడా కాదు.

మామూలు పరిస్థితులలో అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్ ఆతృత పెద్దగా వుండదు. కానీ ఈసారి తన సర్వేలలో ప్రజాభిమానం వుందని నిరూపించుకోలేని వారికి టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి పదే పదే చెప్తుండడంతో, అందరిలోనూ భయం నెలకొంటున్నది. నియోజకవర్గాల పునర్విభజన మరొక సమస్య. అధిక భాగం సీట్ల కోసం ఒకరికి ఐదారుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోటీ పడక తప్పడం లేదు. సర్వేలు ఏమిటో, వాటిని ఎవరు చేయిస్తున్నారో, వాటిలో వాస్తవికత ఎంతో, కల్పితం ఏమిటో ఎవరికీ తెలియదు. అసలు ముఖ్యమంత్రి నిజంగా సర్వేలు జరిపిస్తున్నాడా లేక తనకు ఇష్టం లేనివారిని పక్కన పెట్టడానికి ఈ కుంటి సాకు చెప్పబోతున్నాడా అన్న విషయం కూడా ఎవరికీ తెలియదు. అంతా పరమ రహస్యం.

ఒకటి మాత్రం నిజం. ఈసారి కాంగ్రెస్ టిక్కెట్ పొందేవారిలో నూటికి తొంభై మంది తన స్వంత మనుషులై వుండాలన్నది వైఎస్ వ్యూహం. గత ఎన్నికలలో ఆయనకు ఆ స్వేచ్ఛ లభించలేదు. కాంగ్రెస్‌వర్గాలన్నీ ఎంతో కొంత వాటా పొందాయి. ఆ ప్రమాదం మళ్లీ జరగకుండా ఒక పథకం ప్రకారం టిక్కెట్ల ఎంపిక జరిపిస్తున్నారు.

> ఈసారి కాంగ్రెస్ టిక్కెట్ పొందేవారిలో నూటికి తొంభై మంది తన స్వంత మనుషులై వుండాలన్నది వైఎస్ వ్యూహం.

## డిఎస్ నియంత్రణే పెద్ద సవాలు

పిసిసి అధ్యక్షుడు డిఎస్ ఒక్కడే ఆయన కంటిలో నలక క్రింద లెక్క. ఏ మాత్రం అవకాశం ఇచ్చినా డిఎస్ తమను ఇరకాటంలో పెడతారని వైఎస్, కెవిపిలిద్దరికీ తెలుసు. రకరకాల మార్గాలలో టిక్కెట్ల ఎంపికను ప్రభావితం చేయడానికి డిఎస్ ప్రయత్నించడం ఖాయం. కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర హోంమంత్రి జానారెడ్డి, మాజీ పిసిసి అధ్యక్షుడు కె.కేశవరావు వంటి వారు డిఎస్‌కు సహకరించే అవకాశం వుందని అంచనా. చాలామంది ఎమ్మెల్యేలను డిఎస్ ఇప్పటి నుంచే రెచ్చగొడుతున్నాడు. మీ టిక్కెట్ కోసం నేను పోరాడుతానని హామీ ఇస్తున్నాడు. సిట్టింగ్ ఎమ్మెల్యేల తొలగింపు విషయంలో డిఎస్ నుంచి ప్రతిఘటన తప్పదు. డిఎస్‌ను నియంత్రించడమే ఈసారి టిక్కెట్ల పంపిణీలో వైఎస్‌కు అతి పెద్ద సవాలు. అందువల్లనే ఆయన తాను జరిపించిన సర్వేల గురించి కానీ, ముందుగా తయారుచేసి పెట్టుకొన్న 170 మంది అభ్యర్థుల జాబితా గురించి కానీ డిఎస్‌కు ఏ మాత్రం పోబిడి దొరకకుండా జాగ్రత్తపడుతున్నారు.

## ఎమ్పీలకూ ఎసరు

తనను చీకాకు పెట్టిన లోక్‌సభ సభ్యులను కూడా ఒక పట్టు పట్టాలన్నది వైఎస్ అభిమతమని చెప్తున్నారు. సాధారణంగా శాసనసభ అభ్యర్థుల ఎంపికను ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షులకు వదిలి పెట్టినా; ఎమ్పీ అభ్యర్థుల విషయం మాత్రం తాను స్వయంగా చూసుకోవడం సోనియాగాంధీకి అలవాటు. ఏదో ఒక రకంగా ఆమెకు నచ్చచెప్పి, కొందరు సిట్టింగ్ ఎమ్పీలకు ఎసరు పెట్టాలన్నది వైఎస్ కోరిక. ఈ ప్రమాదం గ్రహించినందువల్లనే



కాబోలు, నిన్న మొన్నటి వరకు వైఎస్‌కు వ్యతిరేకులుగా కానీ, ఆయనకు దూరంగా కానీ మెలగుతుండిన ఎమ్పీలు కొందరు ఇప్పుడాయన కనుసన్నలలో మెలగడానికి సిద్ధపడుతున్నారు. ఈ కోవకు చెందినవారిలో ప్రథమురాలు రేణుకా చౌదరి. గతంలో ఎప్పుడో

తొరవ 14 పేజీలో


## తృతీయ వర్ధంతి



మా అభివృద్ధికి నిరంతరం కృషి చేసి,
మాకు ఉన్నత స్థాయిని కల్పించి
మార్గదర్శకులుగా నిలిచిన మహోన్నత వ్యక్తి
కీ॥శే॥ వంటేరు కోదండరామిరెడ్డి గారు
మా నుండి దూరమై 08-02-2009తేది ఆదివారం నాటికి
3 సంవత్సరములు నిండుతాయి.
మరపురాని వారి మధుర జ్ఞాపకాలు స్మరించుకొంటూ...
వారి పవిత్ర ఆత్మకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య : వంటేరు కమలమ్మ

| కుమారులు | - కోడళ్లు | మనుమలు | - మనుమరాళ్లు |
|---|---|---|---|
| వంటేరు తిరుమలకొండారెడ్డి | - శ్రీదేవి (లేట్) | చైతన్యరెడ్డి | హిమబిందు |
| వంటేరు సుధాకర్‌రెడ్డి | - శ్రీదేవి | సాయిచరణ్ | నీలిమ |
| వంటేరు శ్రీనివాసరెడ్డి | - అమరావతమ్మ | సందీప్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి | |
| వంటేరు అనంతపద్మనాభరెడ్డి | - విజయలక్ష్మి | | హర్షితారెడ్డి |

| కుమార్తె | - అల్లుడు | |
|---|---|---|
| పెళ్లేటి వెంకటలక్ష్మి | - లేట్ వేణుగోపాల్‌రెడ్డి, IPS | మనోజ్‌కుమార్‌రెడ్డి |

కీ॥శే॥ వంటేరు కోదండరామిరెడ్డి గారు
"ఏ" క్లాస్ కాంట్రాక్టర్, V.K.R.R. బస్ ఓనర్, తిరుపతి
జననం : 10-12-1925 మరణం : 08-02-2006


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.